నీట్‌ పేపర్‌ లీకేజీపై విచారణ చేపట్టాలి: ఎస్‌ఎఫ్‌ఐ


ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నీట్‌ గ్రేడ్‌ మార్కులను రద్దు చేయడం కాదని పేపర్‌ లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్‌.ఎల్‌.మూర్తి, టి.నాగరాజు డిమాండ్‌ చేశారు. శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పేపర్‌ లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ సుందరయ్య పార్కు నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశంలో నీట్‌ పరీక్ష గందరగోళంపై కేంద్రం గ్రేడ్‌ మార్కులు పొందిన వారు మార్కులు మాత్రమే రద్దు చేసి జూన్‌ 23న రీ ఎగ్జామ్‌ నిర్వహించి జూన్‌ 30న ఫలితాలు ఇస్తామని సుప్రీం కోర్టుకు కేంద్రం తెలపడం సరికాదన్నారు. అసలు పేపర్‌ లీకేజీపై సమగ్ర విచారణజరపకుండా రీ ఎగ్జామ్‌ నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు దామర కిరణ్‌, కె.అశోక్‌రెడ్డి, మమత, వీరభద్రం, ప్రశాంత్‌, రమ్య, లెనిన్‌, శ్రీకాంత్‌, ప్రశాంత్‌, స్టాలిన్‌, సుష్మ, సుమ పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత


యూనిఫామ్ను అందజేస్తున్న కార్పొరేటర్‌ పావని

చిక్కడపల్లి: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని... ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని గాంధీనగర్‌ కార్పొరేటర్‌ ఎ.పావనివినయ్‌కుమార్‌ అన్నారు. జవహర్‌నగర్‌ ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన బడిబాట, అక్షరాభ్యాస కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్‌ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారంను అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. బీజేపీ సికింద్రాబాద్‌ పార్లమెంట్‌ జాయింట్‌ కన్వీనర్‌ ఎ.వినయ్‌కుమార్‌, పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ ఎం.స్వర్ణలత, ఉపాధ్యాయులు రేణుకా, ఉమాహేశ్వరి, సంగీత, బీజేపీ నాయకులు రత్నసాయిచంద్‌, శ్రీకాంత్‌, కృష్ణప్రసాద్‌, ఎం.ఉమేష్‌, ఆకుల సురేందర్‌, సురేశ్‌, దోనేటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

‘మున్నూరుకాపు వసతి గృహం’పై శ్వేతపత్రం విడుదల చేయాలి

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహంపై శ్వేత పత్రం విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు డాక్టర్‌ కొండ దేవయ్య పటేల్‌ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కాచిగూడలోని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్టుబోర్డు చైర్మన్‌ ప్రొఫెసర్‌ మ్యాడం వెంకట్‌రావును కలిసి వినతి పత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ ప్రతినిధులు కొందరు ట్రస్టుబోర్డుకు సంబంధించిన రూ.200 కోట్ల ఆస్తులు మహాసభకు చెందినవేనని, 1930 నుంచి ఉన్న మహాసభకు ప్రస్తుతం తామే ప్రాతినిధ్యం వహిస్తున్నామని ప్రకటించుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. వసతి గృహం ప్రాంగణంలో ఉన్న రెండు మున్నూరు కాపు మహాసభల్లో ట్రస్టుబోర్డుకు అనుబంధంగా ఉన్న ఏ మహాసభ పనిచేస్తుందో మున్నూరు కాపులకు తెలియజేయాలని కోరారు. మున్నూరుకాపు సంఘం గ్రేటర్‌ హైదరాబాద్‌ అధ్యక్షుడు ఆర్‌.వి.మహేందర్‌ కుమార్‌, ఆకుల బాలకృష్ణ, దేశెట్టి శివ తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌కు పటిష్ట ఏర్పాట్లు చేయండి


డీఎంసీకి వినతిపత్రం ఇస్తున్న నేతలు

ముషీరాబాద్‌: ముస్లింలు పవిత్రంగా జరుపుకొనే బక్రీద్‌ పండుగకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాటు చేయాలని భోలక్‌పూర్‌ డివిజన్‌ బీఆర్‌ఎస్‌ మాజీ అధ్యక్షుడు మహ్మద్‌ అలీ, డివిజన్‌ మైనార్టీ కమిటీ అధ్యక్షుడు మగ్బూల్‌, ముషీరాబాద్‌ నియోజకవర్గం బీఆర్‌ఎస్‌ మైనార్టీ కమిటీ నాయకులు అక్లాక్‌ హుస్సేన్‌, ఖదీర్‌ కోరారు. ఈమేరకు జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మున్సిపల్‌ కమిషనర్‌ (డీఎంసీ) ఖాదర్‌ మోహిన్‌యుద్దీన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో డీఎంసీని మైనార్టీ కమిటీ నాయకులు సోమవారం జరగనున్న బక్రీద్‌ పండుగ నేపథ్యంలో నియోజకవర్గంలోని మసీదుల వద్ద మట్టికుప్పలను తొలగించాలని, నిరంతరం విద్యుత్‌ సరఫరా, మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పండుగ సందర్భాంగా జంతులను వధించడం వల్ల ఏర్పడే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేయాలని కోరారు. ముస్లిం కుటుంబాలకు ఇంటింటికీ వెళ్లి వ్యర్థాను తొలగించేందుకు ప్లాస్టిక్‌ బ్యాగులను అందజేయాలని కోరారు. ఈ సందర్భంగా డీఎంసీ మాట్లాడుతూ... ప్రతి డివిజన్‌కు చెత్తాచెదారం తొలగించేందుకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేయడంతో పాటు ప్లాస్టిక్‌ బ్యాగులను అందజేస్తామన్నారు. ఇప్పటికే జీహెచ్‌ఎంసీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు.

చింతచెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

కాచిగూడ: చింత చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. అడ్మిన్‌ ఎస్‌ఐ సుభాష్‌ తెలిపిన వివరాల ప్రకారం... బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన రాందాసు(59) కాచిగూడ ప్రభుత్వ జూనియర్‌ కాలేజ్‌ వద్ద ఫుట్‌పాత్‌పై ఇస్త్రీ షాపు పెట్టుకుని నడుపుతున్నాడు. షాపు సమీపంలో ఉండే ఇండ్లలో పనిచేస్తుంటాడు. దగ్గరనే ఉన్న ఓ ఇంట్లో చింత చెట్టు, మామిడి చెట్టు ఉంది. చింత చెట్టు ఎక్కి చింతకాయ తెంపుతుండగా ప్రమాదవశాత్తు కిందపడి తలకు తీవ్రగాయమై మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వసతులు లేని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోండి

లిబర్టీ: కనీస వసతులు లేకుండా కళాశాలు, పాఠశాలలను నిర్వహిస్తున్న కార్పొరేట్‌ సంస్థలపై కొరడా ఝుళిపించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ కోరారు. వసతులు కల్పించకుండానే విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తూ పేద విద్యార్థుల తల్లిదండ్రులను పీల్చిపిప్పి చేస్తున్న ప్రైవేటు, కార్పొరేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేట్‌ ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల దోపిడీ గురించి వివరించారు. ఫీజుల నియంత్రణ చట్టం లేకపోవడంతో లైబ్రరీ, బిల్డింగ్‌ తదితరాల పేరుతో ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు.

డీఎంహెచ్‌వో కార్యాలయంలో రక్తదానం శిబిరం


జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో శిబిరంలో అధికారులు

సనత్‌నగర్‌: ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్‌ వెంకటి శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందగా రక్తదానం చేసి రోగుల ప్రాణాలు కాపాడాలని కోరారు. అనంతరం మలేరియా విభాగం అడిషనల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ అమర్‌సింగ్‌ శిబిరాన్ని సందర్శించి రక్తదాతలను అభినందించారు. కాగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ అధికారులు, సిబ్బంది, జిల్లా లెప్రసీ విభాగం వైద్యులు, సిబ్బంది, మలేరియా సిబ్బంది, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సిబ్బంది దాదాపు 51 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అడిషనల్‌ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ అనురాధా, జిల్లా మాస్‌ మీడియా అధికారి జక్కుల రాములు, అడ్మినిస్ట్రేటివ్‌ ఆఫీసర్‌ సునీల్‌కుమార్‌, ఉప మాస్‌ మీడియా అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముజీబ్‌కు శుభాకాంక్షలు



హిమాయత్‌నగర్‌: తెలంగాణ నాన్‌ గెజిటెడ్‌ ఉద్యోగుల సంఘం (టీఎన్‌జీవో) కేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ముజీబ్‌ హుస్సేన్‌ను తెలంగాణ పర్యటక శాఖ కాంట్రాక్ట్‌ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సుబ్బు రాజమౌళి కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పర్యటక శాఖ కాంట్రాక్ట్‌ ఉద్యోగుల సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా రాజమౌళి కోరారు.

బోనాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి

సికింద్రాబాద్‌: నగరంలో నిర్వహించనున్న బోనాల జాతరకు నిధులు కేటాయించాలని లష్కర్‌ జిల్లా సాధన సమితి ప్రతినిధులు కోరారు. ఈ మేరకు జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్‌, ప్రధాన కార్యదర్శి సాదం బాల్‌రాజ్‌యాదవ్‌ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అమ్మవారి ఆలయాలకు రూ.25 కోట్లు కేటాయించాలన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని సమితి ప్రతినిధులు తెలిపారు. జిల్లా సాధన సమితి ప్రతినిధులు బాబూరావు, జగదీశ్‌గౌడ్‌, కృష్ణముదిరాజ్‌, రవీందర్‌సాగర్‌, ఎం.జగ్గయ్య పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ప్రమాద ఘంటికలు!

- భయపెడుతున్న కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు
- చేతికి అందేంత ఎత్తులో వేలాడుతున్న విద్యుత్‌ వైర్లు
- ఆందోళనలో పరిసర ప్రాంతాల ప్రజలు


నింబోలిఅడ్డలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్‌


నింబోలిఅడ్డ సరస్వతి శిశుమందిర్‌ ఎదురుగా కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్‌

కాచిగూడ: విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. వాటికి రక్షణగా కంచె లేకపోవడం.. ఫ్యూజ్‌ బాక్సులకు మూతలు లేకపోవడం.. పలు ప్రాంతాల్లో వైర్లు చేతికి అందేంత ఎత్తులో ఉండటంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోననే ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతోంది.

- అంబర్‌పేట నియోజకవర్గంలో రోజురోజుకు జనాభా పెరుగుతుండటంతో ఇళ్ల నిర్మాణాలు కూడా అదేస్థాయిలే పెరిగిపోయింది. దీంతో విద్యుత్‌ వినియోగం కూడా దానికి తగ్గట్టుగానే పెరిగింది. ఉన్న వాటికే కాకుండా కొత్తగా ఏర్పాటు చేసే ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు నిత్యం భయాందోళనకు గురవుతున్నారు.
- వర్షాకాలం ప్రారంభం కావడంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు.
- అంబర్‌పేట నియోజకవర్గంలోని కాచిగూడ, గోల్నాక, నారాయణగూడ, బర్కత్‌పుర, నింబోలిఅడ్డ, కుద్బిగూడ, నల్లకుంట, చెప్పల్‌బజార్‌ తదితర ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా మారాయి.
- పిల్లర్‌పై ఉంచడంతో విద్యుత్‌ వైర్లు యమపాశాల్లా వేలాడుతున్నాయి. ఈ వైర్ల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనకు గురవుతున్నారు.
- సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన కాలనీల, బస్తీల వాసులు కోరుతున్నారు.
- ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయడంతోపాటు వైర్లు వేలాడకుండా చేయాలి. ఫ్యూజ్‌బాక్స్‌లకు మూతలు ఏర్పాటు చేయాలి.
- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పిచ్చి మొక్కలు, తీగలు అల్లుకోకుండా చర్యలు తీసుకోవాలి.
- విద్యుత్‌ అధికారులు, సిబ్బంది తరచూ ట్రాన్స్‌ఫార్మర్ల పరిస్థితిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలి.

మృత్యువాత పడుతున్న పశువులు...

- ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రధానంగా మూగజీవాలు విద్యుదాఘాతానికిగురై మృత్యువాత పడుతున్నాయి. ఈ విషయం పలుమార్లు
- విద్యుత్‌ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- ట్రాన్స్‌ఫార్మర్‌ రోడ్డుకు అనుకుని ఉండటంతో వాహనదారులతోపాటు పాదచారులకు సైతం ప్రమాదం పొంచి ఉంది. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆవోపా బ్యాంక్‌ చాప్టర్‌ హైదరాబాద్‌ సంస్థ ఆధ్వర్యంలో ఈఏపీసెట్‌, నీట్‌, జేఈఈ అడ్వాన్స్‌డ్‌-2024 ఫలితాల్లో తొలి వెయ్యి ర్యాంకులు సాధించిన వారిలో 100 మంది తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆర్యవైశ్య విద్యార్థులను స్వర్ణ పతకాలతో సత్కరించనున్నట్లు చాప్టర్‌ సంస్థ అధ్యక్షుడు పి.వి.రమణయ్య తెలిపారు. బాగ్‌లింగంపల్లిలో వాకర్స్‌ ఇంటర్నేషనల్‌ సంస్థ ప్రతినిధి సంతప్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ... అర్హులైన వారు దరఖాస్తులను వెబ్‌సైట్‌ నుంచి డౌన్‌లోడ్‌ చేసుకోవాలన్నారు. జూన్‌ 20వ తేదీలోపు వాటిని పంపాలన్నారు. వివరాలకు ఫోన్‌: 94419 28528లో సంప్రదించాలని సూచించారు.

హెలెన్‌ కెల్లర్‌ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అంధులు, బధిరుల ఆరాధ్య దైవం అయిన హెలెన్‌ కెల్లర్‌ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు జయంతి ఉత్సవాలను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డెవలప్‌మెంట్‌ సొసైటీ ఫర్‌ దిడెఫ్‌ జాతీయ కన్వీనర్‌ వల్లభనేని ప్రసాద్‌ కోరారు. శుక్రవారం వికలాంగుల, వృద్ధులు, ట్రాన్స్‌ జెండర్స్‌ సంక్షేమ శాఖ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. అనంతరం వల్లభనేని ప్రసాద్‌ మాట్లాడుతూ... గత ఏడాది జూన్‌లో వికలాంగుల సంక్షేమ భవన్‌లో బధిరుల సంఘాలతో కలిసి ఈ విషయమై సమావేశంలో ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వం స్పందించి జూన్‌ 27న జరిగే హెలెన్‌ కెల్లర్‌ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడంతో పాటు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. నేషనల్‌ కోకన్వీనర్‌ వి.భారతీ, కె.వెంకటేష్‌గౌడ్‌, డి.కిషోర్‌, ఎస్‌ఏ ఉద్దీన్‌, వాసురావు పాల్గొన్నారు.

ప్రమాదకర చెట్ల కొమ్మల తొలగింపు

ముషీరాబాద్‌: ముషీరాబాద్‌ డివిజన్‌ వెస్ట్‌ ఎంసీహెచ్‌ కాలనీ, పార్సిగుట్ట ప్రాంతాలలో విద్యుత్‌ తీగలపై వేలాడుతున్న చెట్ల కొమ్మలను శుక్రవారం ఉద్యానవన శాఖ సిబ్బంది తొలగించారు. ముషీరాబాద్‌ డివిజన్‌ బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు శ్రీధర్‌, మహంకాళీ దేవాలయ కమిటీ చైర్మన్‌ ఎయిర్‌టెల్‌ రాజు, నాయకులు శ్రీనివాస్‌, ఉద్యానవన శాఖ అధికారులతో మాట్లాడారు. చిన్నపాటి వర్షం, ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విద్యుత్‌ తీగలపై పడడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యుత్‌ తీగలపై వేలాడుతున్న చెట్ల కొమ్మలను యంత్రాల సహాయంతో కట్‌ చేసి వాహనాలలో తరలించారు.

బాలుడి అదృశ్యం


పవన్‌కుమార్‌

అంబర్‌పేట: ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలుడు తిరిగిరాని సంఘటన శుక్రవారం అంబర్‌పేట పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ అశోక్‌ సమాచారం మేరకు... బాగ్‌ అంబర్‌పేట రెడ్‌ బిల్డింగ్‌ చౌరస్తా ప్రాంతంలో ఉండే బిందు కుమారుడు పవన్‌ కుమార్‌(11) గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేదు. దీంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ‘స్థానిక’ ఎన్నికలు నిర్వహించండి


మంత్రి పొన్నంకు వినతి పత్రం ఇస్తున్న కుమారస్వామి

కాచిగూడ: కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతంకు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ దళ్‌ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్‌ చేశారు. శుక్రవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి బీసీల డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్‌ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం.. సమగ్ర కులగణనను త్వరితగతిన చేపట్టాలని కోరారు. కులగణన చేస్తామని ఎన్నికల ప్రచారంలో రాహుల్‌ గాంధీ చెప్పినందుకే కాంగ్రెస్‌కు బీసీలు ఓట్లు వేసి 8 ఎంపీ సీట్లను గెలిపించారని అన్నారు. పలు రాష్ట్రాల్లో 50 శాతానికి పైగా రిజర్వేషన్లను అమలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

గ్రూప్‌-2, 3 ఉద్యోగాల సంఖ్య పెంచండి

ఉస్మానియా యూనివర్సిటీ: గ్రూప్‌-2, 3 ఉద్యోగాల సంఖ్య పెంచాలని తెలంగాణ డెమోక్రటిక్‌ స్టూడెంట్‌ ఫోరం (టీడీఎస్‌ఎఫ్‌) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌ నాయక్‌ పేర్కొన్నారు. గ్రూప్‌-2లో 1500, గ్రూప్‌-3లో 2500 ఉద్యోగాలు పెంచేలా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ బీఆర్‌ఎస్‌ నేత ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. అలాగే గ్రూప్‌-1 మెయిన్స్‌కు 1:100 ఇచ్చేలా చూడాలని కోరినట్లు పేర్కొన్నారు.

వైభోగం.. శ్రీవారి బ్రహ్మోత్సవం

- నేత్రపర్వంగా సాగిన శ్రీవారి సూర్యప్రభ వాహన సేవ
- అంగరంగ వైభవంగా టీటీడీ బ్రహ్మోత్సవాలు


సూర్యప్రభ వాహనంపై దర్శనమిస్తున్న స్వామి, అమ్మవార్లు

హిమాయత్‌నగర్‌: హిమాయత్‌నగర్‌ లిబర్టీలోని తిరుమల తిరుపతి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. అందులోభాగంగా రెండవ రోజు శుక్రవారం స్నపన తిరుమంజనం శోభాయమానంగా జరిగింది. ఇందులో భాగంగా స్వామి అమ్మవార్లకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనములతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం ఉదయం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా సూర్యనారాయణుడు సూర్యప్రభామధ్యస్థుడై దివ్యకిరణ కాంతుల్లో ప్రకాశిస్తూ సూర్యప్రభ వాహనంలో దర్శనమిచ్చారు. సూర్యప్రభ వాహనంలో ఉండే సూర్యనారాయణుడిని దర్శిస్తే ఇతోధిక భోగభాగ్యాలు, సత్సంతాన సంపదలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకంగా పేర్కొన్నారు. సాయంత్రం చంద్రప్రభ వాహనంపై స్వామి అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి వచ్చి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కార్మికులకు మెరుగైన సేవలే లక్ష్యం

- అందుబాటులోకి లేబర్‌ డిపార్ట్‌మెంట్‌ వెబ్‌ వెరిఫికేషన్‌ పోర్టల్‌
- ప్రారంభించిన ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణికుముదిని, కార్మిక శాఖ కమిషనర్‌ కృష్ణాదిత్య


పోర్టల్‌ను ప్రారంభిస్తున్న రాణికుముదిని, కృష్ణాదిత్య

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌ రోడ్స్‌లోని కార్మికశాఖ కమిషనర్‌ కార్యాలయంలో తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుకు సంబంధించి నూతనంగా ఏర్పాటు చేసిన టీబీఓసీడబ్ల్యూబీ పోర్టల్‌ (వెబ్‌ వేరిఫికేషన్‌ సిస్టమ్‌)ను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని, కార్మిక శాఖ కమిషనర్‌ కృష్ణాదిత్యతో కలసి శుక్రవారం పోర్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాణి కుముదిని మాట్లాడుతూ... తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు (టీబీఓసీడబ్ల్యూబీ) వివిధ పథకాలను కింద క్లెయిమ్‌లను సమర్థవంతమైన ప్రక్రియను నిర్ధారించేందుకు నూతన విధానం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. గడిచిన 6 నెలల్లో 50 వేలకు పైగా లబ్ధిదారులను గుర్తించి పథకాలను అందించడం అభినందనీయమన్నారు. వివరాలను గోప్యంగా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శాఖ కమిషనర్‌ కృష్ణాదిత్య మాట్లాడుతూ... వెబ్‌ ధ్రువీకరణ వ్యవస్థను టీబీఓసీడబ్ల్యూడబ్ల్యూబీ పోర్టల్‌తో అనుసంధానం అయిందన్నారు. ధ్రువీకరణ కోసం జీహెచ్‌ఎంసీ, సీడీఎంఏ, పంచాయితీ రాజ్‌ నుంచి జనన, మరణాల డేటాతో సజావుగా కనెక్ట్‌ అయిందన్నారు. దీని వల్ల క్లెయిమ్‌ ప్రక్రియ కచ్చితంగా వేగవంతంగా మరింత పారదర్శకంగా ఉంటుందన్నారు. శాఖ అదనపు కమిషనర్‌, బోర్డు కార్యదర్శి డాక్టర్‌ ఇ.గంగాధర్‌ మాట్లాడుతూ... బోర్డు ద్వారా కార్మికులు అందుతున్న పథకాలు అమలు కోసం మరింత వేగవంతంగా అందించడానికి ఈ వెబ్‌ వెరిఫికేషన్‌ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. బోగస్‌, తప్పుడు పత్రాలను గుర్తించడానికి ఉపయోగపడుతుందని వివరించారు. టీబీఓసీసీడబ్ల్యూబ్ల్యూ పోర్టల్‌ ఆన్‌లైన్‌ అందుబాటులో ఉంటుందన్నారు. లబ్ధిదారుల జాబితాలు, వారి వివరాలు, సాధారణ ప్రజలకు అందుబాటులో అంటుందని తెలిపారు. జంటనగరాలు, రంగారెడ్డి, వరంగల్‌ జిల్లాల సంయుక్త కమిషనర్లు శ్యాంసుదర్‌రెడ్డి, ఎల్‌.చతుర్వేది, సునీత, డీసీఎల్‌లు శ్రీనివాస్‌గౌడ్‌, రాజేంద్రప్రసాద్‌, సీఐఓ ప్రసన్న లక్ష్మీ, ఎన్‌ఐసీ సీనియర్‌ డైరెక్టర్‌ హారతి మాథుర్‌, డైరెక్టర్‌ ఇంతియాజ్‌ హైమాద్‌, శాఖా అధికారులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు చేగువేరా

హిమాయత్‌నగర్‌: గెరిల్లా పోరాట యోధుడు, ధైర్యశాలి, మూర్తీభవించిన మానవత్వం వంటి విలువలు కలిగిన మహనీయుడు ఎర్నెస్టో చేగువేరా అని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్‌) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. చేగువేరా జయంతిని ఏఐవైఎఫ్‌ హైదరాబాద్‌ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ... క్యూబాలో జన్మించిన చేగువేరా తన దేశానికే కాక అనేక దేశాలలో పర్యటించి పెట్టుబడిదారీ వ్యవస్థపై అలుపెరుగని పోరాటాలు నిర్వహించిన గొప్ప యోధుడు అని అన్నారు ఏఐవైఎఫ్‌ హైదరాబాద్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఆర్‌. బాలకృష్ణ, నెర్లకంటి శ్రీకాంత్‌, షేక్‌ మహమూద్‌, ఉపాధ్యక్షుడు మజీద్‌ అలీ ఖాన్‌, కళ్యాణ్‌, జగన్‌, వినోద్‌, లతీఫ్‌, హసీమ్‌ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్‌ కార్మికులను పర్మనెంట్‌ చేయాలి

లిబర్టీ: మున్సిపాలిటీలో నిరంతరం పరిశుభ్రత కోసం పని చేస్తున్న మున్సిపల్‌ కార్మికులకు కనీస వేతనం రూ.28 వేలు ఇవ్వాలని తెలంగాణ మున్సిపల్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పొందుతున్న వేతనం ఏమాత్రం సరిపోవడం లేదని అన్నారు. లిబర్టీ వద్ద ఉన్న మున్సిపల్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం అమల్లో ఉన్న వేతనం, ఈఎస్‌ఐ, పీఎఫ్‌ ఇతర కటింగ్‌ మున్సిపల్‌ కార్మికులకి చేతికి వచ్చేది రూ.14 వేలు మాత్రమే అన్నారు. ఈ వేతనంలో పట్టణాలు, మున్సిపాలిటీల్లో ఎలా జీవనం సాగిస్తారని ఆయన ప్రశ్నించారు. అయినా వారిని పర్మనెంట్‌ చేయకుండా వారి శ్రమను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా వారి సేవలను గుర్తించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌ చేశారు. యూనియన్‌ నాయకుడు రాములు పాల్గొన్నారు.

బీ కేటగిరీ సీట్లను కౌన్సెలింగ్‌ ద్వారా భర్తీ చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్‌ కాలేజీల్లో బి కేటగిరీ సీట్లను కౌన్సెలింగ్‌ ద్వారా భర్తీ చేయాలని తెలంగాణ రిపబ్లికన్‌ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నక్క యాదీశ్వర్‌, తెలంగాణ రిపబ్లిక్‌ స్టూడెంట్స్‌ యూనియన్‌ రాష్ట్ర కన్వీనర్‌, ఓయూ ఇన్‌చార్జి బోయ రమేష్‌ డిమాండ్‌ కోరారు. ఈ మేరకు ఇంజినీరింగ్‌, ఫార్మసీ కాలేజీల్లో 2024-25 విద్యా సంవత్సరానికి బీఈ, బీటెక్‌, బీఫార్మసీ, ఫార్మడీ ప్రవేశాలను కౌన్సెలింగ్‌ ద్వారా చేట్టాలని శుక్రవారం రాష్ట్ర ఉన్నత విద్యమండలి చైర్మన్‌ ప్రొ.లింబాద్రికి వినతి పత్రం అందించినట్లు తెలిపారు. బీ కేటగిరీ సీట్ల భర్తీ కాలేజీ యాజమన్యాలకు వదిలేయడం ద్వారా లక్షల ఫీజులు వసులు చేస్తూ తక్కువ ర్యాంక్‌ వచ్చిన అభ్యర్థులకు సీట్లు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రొ.కృష్ణారెడ్డి స్మారక ఉపన్యాసం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పొలిటికల్‌ సైన్స్‌ విభాగం ప్రొఫెసర్‌ కృష్ణారెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్మారక ఉపన్యాసం జరిగింది. ప్రొ.కృష్ణారెడ్డి శిష్యుడు డాక్టర్‌ కోట రాజేశ్‌ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి విశ్రాంత ప్రొఫెసర్‌ చెన్నబసవయ్య అధ్యక్షత వహించగా టీజేఎస్‌ అధ్యక్షుడు ప్రొ.కోదండరామ్‌ జూమ్‌ మీటింగ్‌లో లెక్చర్‌ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ వీసీలు ప్రొ.రవీందర్‌, ప్రొ.మల్లేశంతో పాటు విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాత పింఛన్‌ విధానం అమలు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో 2001 నుంచి 2004 వరకు నియమితులైన ఉద్యోగులకు పాత పింఛన్‌, 2004 తర్వాత నియమితులైన వారికి కాంట్రిబ్యూటరీ పింఛన్‌ విధానాన్ని అమలు చేయాలని ఎన్‌జీవోస్‌ అధ్యక్షుడు బియ్యాని జ్ఞానేశ్వర్‌ డిమాండ్‌ చేశారు. ఓయూ నాన్‌టీచింగ్‌ హోం కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. యూజీసీ చట్టాల ప్రకారం నాన్‌టీచింగ్‌ ఉద్యోగులకు పాలన పదవులు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వర్సిటీ ఉద్యోగులకు హెల్త్‌కార్డులు అందజేయాలని, పాలక మండలి సభ్యులుగా అవకాశం కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వ సమీక్షా సమావేశాల్లో ఉద్యోగులకు భాగస్వామ్యం కల్పించాలని కోరారు.

పైపులైన్‌ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న బ్రిగేడియర్‌ సోమాశంకర్‌, సీఈవో మధుకర్‌ నాయక్‌

రసూల్‌పురా: తిరుమలగిరి చెరువులో మురుగునీరు చేరకుండా చేపట్టిన పైపులైన్‌ పనులను కంటోన్మెంట్‌ బ్రిగేడియర్‌ సోమశంకర్‌, సీఈవో మధుకర్‌ నాయక్‌ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.2.90 కోట్ల వ్యయంతో గత మార్చిలో పనులు చేపట్టగా 80 శాతం మేర పూర్తయినట్లు తెలిపారు. మరో నెలరోజుల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. చెరువు పరిసర ప్రాంతాలైన మలానీ ఎన్‌క్లేవ్‌, పద్మనాభకాలనీ, ఇండియన్‌ ఎయిర్‌లైన్స్‌ కాలనీ, సూర్య అవెన్యూ తదితర కాలనీ ప్రజలు మురుగునీరు, వ్యర్థాలు చెరువులోకి చేరి దుర్వాసన వస్తోందని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేయడంతో మురుగునీరు మళ్లింపు పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో బోర్డు చీఫ్‌ ఇంజినీర్‌ ఉమాశంకర్‌, ఏఈ దినేశ్‌, శానిటరీ సూపర్‌వైజర్‌ గణేశ్‌ తదితరులు పాల్గొన్నారు.